క్లుప్తంగా

పంచముఖి శక్తి గణపతికి ప్రత్యేక పూజలు

మర్రిపాడు: డీసీపల్లిలోని పంచముఖ శక్తి గణపతి ఆలయంలో ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరుకు చెందిన సాంబశివ చారిటబుల్ ట్రస్టు అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలు, పూజా కార్యక్రమాల నిర్వహణకు అనువుగా శాశ్వతంగా రేకుల షెడ్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ రేవూరు సుప్రజ, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డీసీపల్లిలో 696 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 696 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 871 బేళ్లు రాగా, 175 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.358, కనిష్టంగా రూ.180, సగటున రూ.222.14 ధర పలికిందని వివరించారు. వేలంలో 14 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

దుత్తలూరు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ బహిరంగ సభ జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ సంధ్యాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు మండలంలో చేపట్టిన ఉపాధి పనులను తనిఖీ చేసి సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలపై చర్చించనున్నట్లు చెప్పారు. మండలంలోని ఉపాధి సిబ్బంది తప్పక హాజరుకావాలని కోరారు.

అన్నప్రసాద వితరణ

అనుమసముద్రంపేట: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏఎస్‌పేటలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద సోమవారం భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. బస్టాండ్ సెంటర్ యువత ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం చేశారు.

పైపులైన్‌కు మరమ్మతులు



అల్లూరు: నగర పంచాయతీ పరిధిలోని కోనేటి సెంటర్‌లోని ఆర్ఐ రోడ్డులో దెబ్బతిన్న మంచి నీటి పైపులైన్‌కు కమిషనర్ ఫణికుమార్ ఆదేశాల మేరకు నగర పంచాయతీ సిబ్బంది సోమవారం మరమ్మతులు చేపట్టారు. పైపులైన్ దెబ్బతిని తాగునీరు వృథాగా పోతుండడంతో కొన్ని కాలనీలకు తాగునీరు సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు అందడంతో పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు.

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు అనంతరాయనియేనిలో వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి పట్టణానికి చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. గిరిజనుల విన్నపం మేరకు వారి తాగునీటి కష్టాలను తీర్చేందుకు ట్రస్ట్ తరుపున ఆర్వో ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నామని, నెల రోజుల వ్యవధిలో అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, టీ చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ రమాదేవి, ట్రస్ట్ సభ్యులు కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.35లక్షలు పలికిన గణపతి లడ్డూ



లడ్డూను దక్కించుకున్న శ్రీనివాసులునాయుడు



లడ్డూతో రవీంద్రారెడ్డి

అనుమసముద్రంపేట/ఆత్మకూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గణనాథుడి మండపాల వద్ద ఉంచిన లడ్డూ ప్రసాదాల వేలాన్ని సోమవారం నిర్వహించారు. ఏఎస్‌పేట మండలం గుడిపాడులో వినాయకుడి మండపం వద్ద ఉంచిన 12 కిలోల లడ్డూను గ్రామానికి చెందిన కాటా రవీంద్రారెడ్డి రూ.1,35,500కు దక్కించుకున్నారు. రాజవోలులో ఏర్పాటు చేసిన 50 కేజీల లడ్డూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నెల్లూరుపాళెంలోని గణేశ్ మండపం వద్ద ఉంచిన లడ్డూను వేలంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు చెరుకూరి శ్రీనివాసులునాయుడు రూ.67వేలకు దక్కించుకున్నారు.

గంగమ్మ ఒడికి గణేశుడు

పార్వతి తనయుడు గణేశుడు గంగమ్మ ఒడికి చేరాడు. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో మూడ్రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథులను సోమవారం నిమజ్జనం చేశారు. చివరి రోజు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆనందోత్సాహాల నడుమ వీడ్కోలు పలికారు. డీజే పాటలు, డప్పు వాయిద్యాలు, మహిళల కోలాట ప్రదర్శనల నడుమ గణనాథుల ఊరేగింపులు శోభాయమానంగా సాగాయి. యువత ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం గణేశా వెళ్లి రావయ్యా అంటూ సమీపంలోని జలవనరుల్లో ప్రతిమలను నిమజ్జనం చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూరు: పంటవీధిలో గణేశుడి ఊరేగింపు



సంగం: మహారాష్ట్ర బ్యాండ్ మేళం సందడి



ఆత్మకూరు: గురుకుల పాఠశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థినులు



కావలి: అన్నగారిపాలెం తీరంలో వినాయకుడి నిమజ్జనం



మర్రిపాడు మండలం నందవరంలో..



సంగం: నిమజ్జనానికి తరలిన శివాజీసెంటర్ వినాయకుడు



కావలి: తుమ్మలపెంట తీరంలో వినాయకుడ్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువత



కావలి: గంగమ్మ ఒడిలో చేరిన వినాయకుడు



ఆత్మకూరు పట్టణంలోని నాగేంద్రపురంలో..



దుత్తలూరులో..



సంగం బ్యారేజ్ వద్ద క్రేన్‌తో గణనాథుడి నిమజ్జనం



వింజమూరులో గణనాథుడి ఊరేగింపు



కావలి: పట్టణంలో వినాయకుడి ఊరేగింపు



ఆత్మకూరు పట్టణం ఉత్తరబలిజవీధిలో..




జలదంకి మండలం వేణుగోపాలపురంలో..



కలిగిరి: చంద్రారెడ్డిపాలెంలో..



సోమశిల: నిమజ్జనోత్సవాలను పర్యవేక్షిస్తున్న పోలీసులు



ఆత్మకూరురూరల్: గండ్లవేడులో..

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం

- మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు: విజయవాడలో సంభవించిన బుడమేరు వరదలతో నష్టపోయిన బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ, బుడమేరుకు భారీగా వరద వస్తోందని నీటిపారుదల శాఖ అధికారులు ముందస్తుగా హెచ్చరించినా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. దీంతో విజయవాడలోని లోతట్టు ప్రాంతాలు మునిగిపోయి భారీగా ప్రాణ, ఆస్తి నష్టం ఏర్పడిందన్నారు. స్వయంగా ఓ ప్రభుత్వ అధికారే వరద వస్తోందని ముందుగా తెలిసినా ప్రజలు వెళ్లరనే సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు చేయలేదని చెప్పడం ప్రభుత్వ పనితీరును తెలియజేస్తోందన్నారు. వరద బాధితులను ఆదుకోవడంలోనూ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. మూడు రోజుల పాటు ఆహారం, తాగునీరు అందించలేకపోవడంతో ప్రజలు అల్లాడారన్నారు. ఇప్పటికీ బాధితులకు పూర్తిస్థాయిలో నిత్యావసరాలు అందజేయలేదన్నారు. సర్వం కోల్పోయిన బాధితులకు నగదు సాయాన్ని ప్రకటించలేదన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ చంద్రబాబు హడావుడి చేయడంతో అధికారులు సైతం సహాయ కార్యక్రమాలను చేపట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం మోపి అంతా తానొక్కడినే చేస్తున్నట్లుగా ప్రజల్లో భ్రమలు కల్పించేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నం అందరికీ అర్థమవుతోందన్నారు. విజయవాడలోని కృష్ణలంక ప్రాంతంలో గత ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రిటైనింగ్ వాల్ కట్టించడంతో ఆ ప్రాంతవాసులు ముంపు నుంచి తప్పించుకున్నారని గుర్తుచేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బాధ్యత గల అధికారులకు రక్షణ చర్యల విషయంలో స్వేచ్ఛ ఇస్తే సజావుగా పనులు సాగుతాయన్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ వైఫల్యంతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరగడం బాధాకరమన్నారు. వరద బాధితులను ఉదారంగా ఆదుకోవాలని కోరారు.

నేటి నుంచి న్యాయవాదుల సమ్మె



కావలి: కావలి బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో న్యాయవాదుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో న్యాయవాదులకు వ్యతిరేకంగా అడ్వొకేట్ యాక్ట్–1961 చట్టాన్ని సవరణ చేస్తూ నూతనంగా తీసుకొచ్చిన అడ్వొకేట్ యాక్ట్–2023 చట్టాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం నుంచి మూడ్రోజుల పాటు కోర్టు విధులను బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. బార్ సభ్యులు సునీల్ బాబు, అభిషేక్, జ్యోతి, రాజేంద్రప్రసాద్, శేషుప్రసాద్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు రెడ్‌క్రాస్ వైద్య సహాయక బృందం



కావలి: విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణ నిమిత్తం కావలి రెడ్‌క్రాస్ వైద్య సహాయక బృందం సోమవారం విజయవాడకు తరలి వెళ్లింది. కావలి రెడ్‌క్రాస్ విపత్తు నిర్వహణ విభాగ కన్వీనర్, ప్రథమ చికిత్స శిక్షకుడు బీద లక్ష్మీనంద నాయకత్వంలో రూ.1.10లక్షల విలువైన మందులతో సహాయక బృందం బయలుదేరి వెళ్లింది. రెడ్‌క్రాస్ కావలి శాఖ చైర్మన్ రవిప్రకాశ్, రాష్ట్ర చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, వైద్య సహాయక బృందం సచికేత్, సాయికుమార్, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలంబడి వాయిదా

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో మంగళవారం నుంచి ప్రారంభం కావాల్సిన పొలంబడి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఏడీ పీ చెన్నారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాను నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని వాయిదా వేశామని చెప్పారు. ఈ నెల 24వ తేదీన తిరిగి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

డ్రాపౌట్స్‌ను గుర్తించండి

ఉదయగిరి : బడిబయటతో పాటు మధ్యలో చదువు మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి ఆదేశించారు. మండల విద్యావనరుల కేంద్రంలో సీఆర్‌ఎంటీలతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటింటిని సందర్శించి పిల్లల వివరాలను యాప్‌లో నమోదుచేయాలన్నారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలీం పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా ప్రైవేట్ ట్రావెల్స్ నిలిపివేత



ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయటకొస్తున్న ఆర్టీసీ బస్సుకు అడ్డంగా నిలిపి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్



రోడ్డుపై అడ్డదిడ్డంగా ప్రైవేట్ ట్రావెల్స్‌ను నిలిపివేసిన దృశ్యం

కావలి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ట్రంకురోడ్డుపై ప్రైవేట్ ట్రావెల్స్‌ను అడ్డదిడ్డంగా నిలిపి వేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. సాయంత్రం 7 నుంచి రాత్రి 11 గంటల వరకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, చెన్నై, బెంగుళూరు, తదితర మార్గాల్లో వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్‌ను ప్రయాణికులను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్టాండ్ గేటు ఎదుటే ట్రంకురోడ్డుపై నిలిపివేస్తున్నారు. దీంతో ట్రంకురోడ్డుపై వెళ్లే వాహనచోదకులతో పాటు ఆర్టీసీ బస్టాండ్‌లో నుంచి బయటకు వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఆర్టీసీ ఆదాయానికి గండిపడుతుండడంతో ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిలపకుండా ఆర్టీసీ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతోనే ఆర్టీసీ బస్టాండ్ గేటు ముందే ప్రైవేట్ ట్రావెల్స్‌ను దర్జాగా ఆపగలుగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీసీ బస్టాండ్‌లోకి వచ్చే ప్రయాణికులను ఎక్కించుకోగలుగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీసీ ఆదాయానికి గండి కొట్టడంతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే ప్రైవేట్ ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడు రామచంద్రారెడ్డి

మర్రిపాడు/సోమశిల: మర్రిపాడు, అనంతసాగరం మండలాల్లో సోమవారం చోటు చేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు..మర్రిపాడు మండలం బూదవాడకు చెందిన భేరి రామచంద్రారెడ్డి రోడ్డుపై నడిచి వెళ్తుండగా, శెట్టిసముద్రం గ్రామానికి చెందిన పొదిలి వెంకటేష్, పొదిలి నాగరాజు, తంబులూరి నాగేష్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రామచంద్రారెడ్డి తీవ్రంగా గాయపడగా, బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. అలాగే అనంతసాగరం మండలం మంచాలపల్లికి చెందిన మనోహర్ బైక్‌పై అనంతసాగరం వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

మద్యం దుకాణాల ఉద్యోగులకు ఎసరు

- అక్టోబర్ 1 నుంచి అమల్లోకి కొత్తమద్యం పాలసీ
- ప్రభుత్వ దుకాణాల స్థానంలో తెరుచుకోనున్న ప్రైవేట్ షాపులు
- వీధిన పడనున్న 650మంది సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు



సీతారామపురంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

సీతారామపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వంలో కొత్తగా ఉద్యోగాలు పొందిన వారికి ఎసరు పెడుతోంది. గత ప్రభుత్వంపై అక్కసుతో వారిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటుండడంతో చిరుద్యోగుల్లో అభద్రతా భావం నెలకొంది. ఇప్పటికే వలంటీర్లకు వేతనాలు ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ప్రభుత్వం..పాఠశాలల్లోని పారిశుద్ధ్య కార్మికులు, ఆయాలకు సైతం నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా వేధిస్తోంది. తాజాగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు సకాలంలో చెల్లించడం లేదనే విమర్శ ఉంది. వచ్చే నెలాఖరుకు ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేట్ దుకాణాలు రానుండడంతో జిల్లాలోని 650 మందికి పైగా సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడనున్నారు. 2019వ సంవత్సరం ముందు వరకు నాటి టీడీపీ ప్రభుత్వం మద్యాన్ని ఓ ఆదాయ వనరుగా మాత్రమే చూసింది. టీడీపీ నేతలకు ఉపాధి కల్పించడం, వేల కోట్ల రూపాయలను ఆర్జించడమే లక్ష్యంగా ప్రైవేట్ దుకాణాలకు లైసెన్సులు జారీ చేసింది. అటు తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రైవేట్ దుకాణాల దందాకు కళ్లెం వేసి వాటి స్థానంలో ప్రభుత్వ దుకాణాలు తీసుకొచ్చింది. ఎమ్మార్పీకే మద్యం అందిస్తూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించింది. ఒక్కో దుకాణంలో ఒక సూపర్‌వైజర్‌తో పాటు ఇద్దరు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మెన్, (కొన్నిచోట్ల ఇద్దరూ) చొప్పున నిరుద్యోగులకు అవకాశాలు కల్పించింది. వీరిలో సూపర్‌వైజర్లకు నెలకు రూ.21,500, సేల్స్‌మెన్‌లకు రూ.18 వేలు, వాచ్‌మెన్లకు రూ.12 వేలు చొప్పున వేతనాలు ఇస్తూ వచ్చింది. ఇలా జిల్లాలోని 193 మద్యం దుకాణాల్లో 650కు పైగా కుటుంబాలకు ఉపాధి లభించింది. తాజాగా అక్టోబరు 1వ తేదీ నుంచి కొత్త మద్యం పాలసీ తీసుకొస్తూ ఇప్పటికే నడుస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో 650కు పైగా కుటుంబాల పరిస్థితి రోడ్డున పడినట్టైంది.మద్యం దుకాణాలు ప్రైవేట్ పరం చేయడం ప్రభుత్వ నిర్ణయానికి వదిలేసినా, ఇక్కడ పనిచేస్తున్న వందలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత ఇవ్వాలని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వ పెద్దలు సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.

ఏదోక చోట అవకాశం కల్పించాలి



మద్యం దుకాణాల్లో పనిచేసే మేము చాలా చిన్న ఉద్యోగులం. మాకు రాజకీయ పార్టీలతో ఏ మాత్రం సంబంధం లేదు. వచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. కొత్త పాలసీ అమలు చేస్తే మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. కానీ మమ్మల్ని రోడ్డున పడేయకుండా ఏదో ఒకచోట సర్దుబాటు చేయాలని కోరుకుంటున్నాం.

– రాజేంద్రప్రసాద్, సూపర్‌వైజర్

మా పరిస్థితి అర్థం కావడం లేదు



ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకురానుండడంతో మా పరిస్థితి ఏంటోఅర్థం కావడం లేదు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు సిద్ధంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. మా పొట్ట కొట్టకుండా మమ్మల్ని ఏదోకచోట సర్దుబాటు చేసి కుటుంబాలను పోషించుకునే స్థామత కల్పించండి.

– వెంకటేశ్వర్లు, సేల్స్‌మెన్